నమస్తే తెలంగాణ

# సిద్దిపేట

I హైదరాబాద్, ఆదివారం 18 ఆగస్టు 2024 SIDDIPET



దాడి ఘటనపై సిద్దిపేట సీపీ అనురాధకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



సిద్దిపేట క్యాంపు కార్యాలయం వద్ద శనివారం కార్యకర్తలతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

# టెన్షన్..టెన్షన్

## సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై శుక్రవారం అర్ధరాత్రి కాంగ్రెస్ గూండాల దాడి

- హరీశ్‌రావుకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు కట్టిన కాంగ్రెస్
- తొలిగించాలని నిరసన వ్యక్తం చేసిన బీఆర్ఎస్ నాయకుల ఆరెస్ట్
- శనివారం పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మల దహనం
- బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసిన సిద్దిపేట పోలీసులు
- పోటీగా కాంగ్రెస్ నాయకుల ర్యాలీ



సిద్దిపేట కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, ఆగస్టు 17: సిద్దిపేట పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి హైటెన్షన్ నెలకొన్నది. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును కించపర్చే విధంగా కాగ్రెస్ నాయకులు పట్టణంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం పట్ల బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టగా వారిని పోలీసులు ఆరెస్టు చేసి త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ కార్యకర్తలు అర్ధరాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడిచేసి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫ్లెక్సీలను చింపివేశారు.దీంతో శనివారం ఉదయం సిద్దిపేట పట్టణంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు ఉదయం నుంచే భారీ ఎత్తున క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు. ఉదయం ఎమ్మెల్యే హరీశ్‌రావును కించపర్చేవిధంగా ఉన్న ఫ్లెక్సీలను కార్యకర్తలు తొలిగించారు.

### బీఆర్ఎస్ ఆధర్యంలో భారీ ర్యాలీ

సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడిని నిరసిస్తూ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి,నల్ల జెండాలను చేతపట్టి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నివాదాలు చేశారు. సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అనంతరం పాత బస్టాండ్ వద్ద బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే పోలీసులు ఎందుకు రెచ్చగొడుతున్నారంటూ బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించడంతో పోలీసులు వెనక్కి తగ్గారు. పాతబస్టాండ్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశా రు. అదే సమయంలో పోటీగా ర్యాలీ నిర్వహించిన కాంగ్రెస్ నాయకులను పోలీసులు ఆరెస్టు చేసి వ్యాన్‌లో పాతబస్టాండ్ వైపు నుంచి తరలిస్తుండగా వారు నివాదాలు చేయడంతో పోలీసుల వ్యాన్‌పైకి బీఆర్ఎస్ నాయకులు దూసుకెళ్లే ప్రయ త్నం చేయడంతో పోలీసులు కట్టడి చేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఆరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈసందర్భగా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కొండం సంపత్‌రెడ్డి, పాల సాయిరామ్ మాట్లాడుతూ క్యాంపు కార్యాలయంపై దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని, శాంతియుతంగా ఉన్న సిద్దిపేటలో చిచ్చురగిల్చే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు.శాంతి భద్రతలు కాపాడడం పోలీసుల బాధ్యత అన్నారు. పోలీసులు అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. పోలీసుల నిర్లక్ష్యం కారణంగా క్యాంపు కార్యాలయంపై దాడి జరిగిందన్నారు. సిద్దిపేటలో ఏ సంఘటన జరిగినా పోలీసులు, కాంగ్రెస్ నాయకులు బాధ్యత తీసుకోవాలని హెచ్చరించారు. సిద్దిపేట ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధిని కించపరుస్తూ కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలిగించాలని చట్టబద్ధంగా కోరితే పూర్తిగా నిర్లక్ష్యం వహించి ప్రభుత్వానికి వత్తాసు పలికే విధంగా ఉండటం సరికాదన్నారు. సంపూర్ణంగా పంట రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, ధర్మవరం బ్రహ్మం, సోమిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్ గౌడ్, ఎల్లారెడ్డి, రెడ్డి యాదగిరి, రజనీకాంత్, మహేశ్‌తోపాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నం

సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ శ్రేణులు శనివారం ఉదయం ప్రయత్నించారు. ర్యాలీగా వస్తున్న వారిని పోలీసులు అడ్డుకొని ఆరెస్టు చేసి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

### సీపీకి, కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును కించపర్చేవిధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు, క్యాంపు కార్యాలయంపై దాడికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు కలెక్టర్‌కు, సీపీ అనురాధకు ఫిర్యాదు చేశారు.



సిద్దిపేటలో ఎమ్మెల్యే అధికారిక క్యాంపు కార్యాలయంపై దాడి చేసి ఫ్లెక్సీలను చింపివేసిన కాంగ్రెస్ కార్యకర్తలు



సిద్దిపేట పట్టణంలో నిరసన ర్యాలీ తీస్తున్న బీఆర్ఎస్ నాయకులు



సిద్దిపేటలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



సిద్దిపేటలో బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసుల లాఠీచార్జి

# హరీశ్‌రావుకు ఘన స్వాగతం

సిద్దిపేట, ఆగస్టు 17 : హైదరాబాద్ నుంచి సిద్దిపేట క్యాంపు కార్యాలయానికి చేరుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం ఘన స్వాగతం పలికారు. అభిమానులు, గులాబీ శ్రేణులతో సిద్దిపేట క్యాంపు కార్యాలయం కోలాహలంగా మారింది. సీఎం రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. హరీశ్ అన్న జిందాబాద్ అంటూ చేసిన నినాదాలు హోరెత్తాయి. ఈ సందర్భంగా హరీశ్‌రావు అందరితో కరచాలనం చేసి ఆనందం వ్యక్తం చేశారు.



సిద్దిపేటలో ఉద్యోగ విరమణ పొందిన వారితో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

# ఊపిరి ఉన్నంత వరకు సేవచేస్తా

- నా ధ్యాసంతా సిద్దిపేట అభివృద్ధిపైనే..
- ఎన్జీవో భవన్‌తో నాకు 21 ఏండ్ల అనుబంధం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేట ఎన్జీవో భవన్‌లో విద్యార్థులను సన్మానిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఆగస్టు 17 : ఊపిరి ఉన్నంత వరకు సిద్దిపేట ప్రజలకు సేవ చేస్తానని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని ఎన్జీవో భవన్‌లో ఉద్యోగ విరమణ పొందిన జీవిత సభ్యులకు, టెన్త్‌లో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు శనివారం జ్ఞాపికలు, మెడల్స్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట అభివృద్ధికి మారుపేరని, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కీర్తి ప్రతిష్టను పెంచామన్నారు. కరోనా సమయంలో సిద్దిపేట ప్రజలను కుటుంబ సభ్యుల్లాగా కాపాడుకున్నామని, ఏనాడూ అరాచకాలకు పాల్పడలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదన్నారు. సిద్దిపేటలో అభివృద్ధి పనుల నిధులను రద్దుచేసి కొడంగల్‌కు తీసుకువెళ్తున్నారన్నారు. ఎన్జీవో భవన్‌తో తనకు 21 ఏండ్ల అనుబంధం ఉందన్నారు. సిద్దిపేట ఎన్జీవో భవన్ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు అల్పాహారంతోపాటు ట్యాబ్‌లు సైతం అందించామన్నారు. ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లా రెండో స్థానంలో నిలిచిందన్నారు. 75 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారన్నారు. 169 మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించి రాష్ట్రంలోనే సిద్దిపేట మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఎన్జీవో భవన్ నాయకులు విక్రంరెడ్డి, కల్లేపల్లి శ్రీనివాస్, అంజయ్య, స్థానిక కౌన్సిలర్ సాయిశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల బీభత్సం

- సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫ్లెక్సీల చించి వేత..హంగామా
- ఇరువర్గాలపై కేసు నమోదు
- సిద్దిపేట ఏసీపీ మధు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 17: సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంలోకి శుక్రవారం రాత్రి కాంగ్రెస్ కార్యకర్తలు అత్తుమామ్, మహ్మద్ గౌస్, నవాజ్‌బాబా, మున్నా అక్రమంగా చొరబడి నానాహంగామా సృష్టించారు. క్యాంపు ఆఫీస్ ఫ్లెక్సీ బోర్డును చింపివేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే పీఏ పోలీసులకు ఫిర్యాదు చేయగా సదరు కాంగ్రెస్ కార్యకర్తలపై పలు సెక్షన్ల కింద వన్‌టౌన్ పోలీసుల కేసు నమెదు చేశారని సిద్దిపేట ఏసీపీ మధు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పంటరుణ మాఫీ విషయ మై ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారన్నారు. పంట రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేశామని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజీనామా చేయాలని కోరుతూ..పట్టణంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగా ఇరు వర్గాల మధ్య మాటల యుద్ధం కొనసాగిందన్నారు. దీంతో పోలీసుల కల్పించుకొని ఇరువర్గాల నాయకులకు అక్కడి నుంచి పంపించారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంలోకి చొరబడడంతో ఇరు వర్గాలు ఘర్షణకు దిగారు. దీంతో బీఆర్ఎస్ నేతలను మాత్రమే పోలీసులు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### అకారణంగా బీఆర్ఎస్ నేతలపై కేసులు

సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి అక్రమంగా చొరడి చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నది కాంగ్రెస్ నేతలైతే అకారణంగా పోలీసులు శనివారం పలువురు బీఆర్ఎస్ నేతలపై వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేంది లేదని సిద్దిపేట ఏసీపీ మధు స్పష్టం చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# చారిటీకి రక్షణ కల్పించాలి

**ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్**



సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 17: చారిటీకి రక్షణ కల్పించాలని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కోరారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన కలెక్టర్‌ను కలిసి సదాశివపేటలో ఉన్న తన చారిటీకి రక్షణ కల్పించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సదాశివపేటలో మొత్తం 1200 ఎకరాల చారిటీ భూమి ఉన్నదని, అందులో దాదాపు 50 ఎకరాల భూమిని కొందరూ కబ్జా చేశారని తెలిసిందన్నారు. ఈ విషయంపై ఇప్పటికే జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు. ఇప్పటికైనా అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో కోర్టును ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. నేను బటన్ నొక్కితే పైకి పోవాల్సిందే అంటూ శాపనార్థాలు పెట్టారు. దేవుడి మాన్యాలపై ఎవరు కన్నేసినా వారు భూమిపై బతకరని పేర్కొన్నారు. ఇందుకు నిదర్శనం తన అన్నతో సహా మొత్తం ఏడుగురు పైకిపోయారని వివరించారు. తన చారిటీ భూముల డబుల్ రిజిస్ట్రేషన్ చేసిన రిజిస్టర్, అందుకు సహకరించిన తహసీల్దార్లపై చర్యలు తీసుకునేందుకు సమయం ఇచ్చానని, ఆ సమయంలోగా సంబంధిత అధికారులందరిపై చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశాల నుంచి ఖాళీ చేతులతో తిరిగి వచ్చారని చెప్పారు. తనతో అమెరికా వస్తే పెట్టుబడులు తెస్తానని, లక్ష ఉద్యోగాలు ఇప్పిస్తానని స్పష్టం చేశారు. ప్రపంచంలోని మొదటి ముగ్గురు ధనవంతులతో కల్పిస్తానని, తద్వారా 100 కంపెనీలు తీసుకొచ్చి లక్ష ఉద్యోగాలు ఇప్పిస్తానని పేర్కొన్నారు. అందులో 10 కంపెనీలను సంగారెడ్డిలో ఏర్పాటు చేయిస్తానన్నారు. సంగారెడ్డిలో నిరుద్యోగి లేకుండా చేస్తానని చెప్పారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై సుప్రీం కోర్టులో కేసు వేస్తానని పేర్కొన్నారు. ఒక పార్టీపై గెలిచి మరో పార్టీలోకి వెళ్లడం తప్పు అన్నారు.

# పోడు రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

## కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు కొండా సురేఖ, సీతక్క



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరైన సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, సంక్షేమశాఖ అధికారి అఖిలేశ్‌రెడ్డి

మెదక్, ఆగస్టు 17(నమస్తే తెలంగాణ)/సంగారెడ్డి కలెక్టరేట్/సిద్దిపేట కలెక్టరేట్: పోడు రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా, వారి ఉపాధికి భంగం కలగకుండా అటవీశాఖ మార్గదర్శకాలు అనుసరిస్తూ పోడు భూముల రక్షణకు కృషి చేయాలని అటవీ, పర్యావరణ, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క అధికారులను ఆదేశించారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లు, అటవీశాఖ అధికారులు, ఏజెన్సీ ప్రాంత ప్రజాప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ..పోడు భూముల్లో సాగుచేసుకుంటున్న రైతు కుటుంబాలు సున్నితమైన పరిస్థితుల్లో అటవీశాఖ అధికారులకు ఎలాంటి హానీ తలపెట్టవద్దని, క్రమశిక్షణ చర్యలకు గురికావద్దని సూచించారు. పోడు భూములు సాగుచేసుకుంటున్న రైతుల హక్కులను కాపాడడంలోనూ, అటవీశాఖ భూములు కాపాడి విధులు నిర్వర్తిస్తున్న అటవీ అధికారులకు రక్షణ కల్పించడంలోనూ ప్రభుత్వం సమన్వయంతో ముందుకు సాగుతున్నదన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఏండ్లుగా పోడు భూములు సాగుచేసుకుంటున్న రైతు కుటుంబాల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని, వ్యవసాయం పేరుతో మార్గదర్శకాలకు, చట్టాలకు విరుద్ధంగా కొత్తగా పోడు భూములను గుర్తిం చి ఆయా ప్రాంతాల ప్రజా ప్రతినిధులతో చర్చించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. అటవీ ప్రాంతంలో చెట్లు నరికితే కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గిరిజనులకు అటవీశాఖ వ్యతిరేకం కాదు అనే భావన తొలిగించేలా అధికారులు పని చేయాలని సూచించారు. మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పోడు భూముల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. వీడియోకాన్ఫరెన్స్‌లో మెదక్ అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు, డీఎఫ్‌వో జోజి, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, సంక్షేమ శాఖ అధికారి అఖిలేశ్‌రెడ్డి, సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి తదితరులు పాల్గొన్నారు.

# పంట రుణమాఫీ కోసం రోడ్డెక్కిన రైతులు

- సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం రామునిపట్ల రాజీవ్ రహదారిపై రాస్తారోకో
- సీఎం రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు
- రైతుల రాస్తారోకోకు మద్దతు ప్రకటించిన బీఆర్ఎస్ శ్రేణులు
- అబద్ధాల సీఎం రాజీనామా చేయాలని డిమాండ్
- బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేసిన పోలీసులు



సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామునిపట్ల రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

చిన్నకోడూర్ ఆగస్టు 17:అబద్ధపు మాటలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15వతేదీలోపు రెండు లక్షల పంట రుణ మాఫీ చేస్తానని ప్రమాణం చేసి తెలంగాణ రైతులు, ప్రజలను మోసం చేశాడని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్,సీనియర్ నాయకుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ఆరోపించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామునిపట్ల రాజీవ్ రహదారిపై శనివారం రైతులు రాస్తారోకో చేపట్టారు. రైతులు చేస్తున్న రాస్తారోకోకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేయకుండా కాలయాపన చేయడమే కాకుండా పంటరుణమాఫీ చేయమని అడిగిన రైతులు, బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేయించి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట రుణమాఫీ చేయకపోగా ప్రజా నాయకుడు హరీశ్‌రావును రాజీనామా చేయాలని రేవంత్‌రెడ్డి మాట్లాడటం దొంగేదొంగ అన్నట్లు ఉన్నదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల పంటరుణమాఫీ తక్షణమే చేయాలని, లేకుంటే సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ములకల కనకరాజు, ఎంపీపీ పాపయ్య, ఆర్ఎస్ నాయకులు కొండం రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కాముని ఉమేశ్ చంద్ర, వైస్ సుంచు రమేశ్, మిట్టపల్లి గణేశ్, బైండ్ల సుధాకర్, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్, చెందు, సాయి, రైతులు పాల్గొన్నారు.

### మండల కేంద్రంలో రైతుల ధర్నా

చిన్నకోడూరు మండలకేంద్రంలో రెండు లక్షల పంటరుణ మాఫీ కాని రైతులు అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్దఎత్తున శనివారం ధర్నా చేపట్టారు.ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే రెండు లక్షల పంట రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం పంట రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి అందరికీ పంట రుణ మాఫీ అయిందంటూ అబద్ధపు ప్రచారాలు మానుకొని అందరికీ మాఫీ చేయాలంటూ డిమాండ్ చేశారు.



చిన్నకోడూర్‌లో రైతులను అరెస్టు చేస్తున్న పోలీసులు

# ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

- రింగ్ రోడ్డుకు భూములు ఇవ్వం
- సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతుల ధర్నా



సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

సంగారెడ్డి, ఆగస్టు17: ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని, రింగ్ రోడ్డుకు భూములు ఇచ్చేదిలేదని ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు నిరసన వ్యక్తం చేశారు. శనివారం సంగారెడ్డి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట కొండాపూర్ మండలం గిర్మాపూర్, సదాశివపేట మండలం పెద్దాపూర్ గ్రామాల రైతులకు ఆర్డీవో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఆర్ సమావేశాన్ని బహిష్కరించి ధర్నా నిర్వహించారు. అంతకుముందే ఆయా గ్రామాల్లో ట్రిపుల్‌ఆర్‌కు భూములు ఇవ్వమని, గ్రామస్తులంతా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల రైతులు మాట్లాడుతూ ఇప్పటికే ఆయా గ్రామాల మీదుగా జాతీయ రహదారి, పెద్దాపూర్ ఫిల్టర్‌బెడ్, మంజీరా పైపులైన్, చెరువులు, కాల్వల నిర్మాణం వంటి వాటికి మా భూములు తీసుకుని కూలీలుగా మార్చారన్నారు. ప్రస్తుతం రెండు పంటలు పండే భూములు తీసుకుంటే మాకు ఎలాంటి జీవనాధారం లేకుండా పోతున్నదని అవేదన వ్యక్తం చేశారు. ఊరికి ఉత్తరాన మంజీరా డ్యామ్, ఫిల్టర్‌బెడ్, దక్షిణాన మల్కాపూర్ పెద్ద చెరువులు ఉన్నాయన్నారు. వీటన్నింటి మధ్య నుంచి రింగ్‌రోడ్డు వేయడం రైతుల నోట్లో మట్టికొట్టడమే అవుతుందన్నారు. ఇప్పటికే సంగారెడ్డి పక్కన ఉన్న నాందేడ్-అకోలా రోడ్డు శివంపేట నుంచి కంది ఐఐటీ వరకు జాతీయ రహదారి ఉన్నదన్నారు. ఈ రోడ్డును చింతల్‌పల్లికి జతచేయడంతో చింతల్‌పల్లి, తాళ్లపల్లి, కల్బ్‌గూర్, కులబ్‌గూర్, ఇరిగపల్లి, గిర్మాపూర్, పెద్దాపూర్‌లో భూసేకరణ మిగిలిపోతున్నదన్నారు. ప్రభుత్వానికి కూడా బడ్జెట్ మిగులుతుందని, ఈ విషయాన్ని గుర్తించి గిర్మాపూర్-పెద్దాపూర్ నుంచి అలైన్‌మెంట్ మార్చి రైతుల విన్నపాన్ని అంగీకరించాలన్నారు.రైతుల అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు ప్రభుత్వానికి నివేదికలు అందజేయాలని కోరారు. రైతులకు రైతు సంఘాల నాయకులు జయరాజు, పృథ్వీరాజ్, టీజేఎస్ తుల్జారెడ్డి మద్దతు ప్రకటించారు. ధర్నాలో గిర్మాపూర్ మాజీ సర్పంచ్ మల్లేశం, పెద్దాపూర్ మాజీ సర్పంచ్ మల్లేశం, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.